పొత్తుపై తేలని నిర్ణయం

పీఎంకే, డీఎండీకేల్లో అయోమయం

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయి రెండు రోజుల్లో నామినేషన్ల స్వీకరణ ఘట్టం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పీఎంకే, డీఎండీకేలు అన్నాడీఎంకే కూటమిలో చేరాలా? లేక బీజేపీ కూటమితో పొత్తు కుదుర్చుకోవాలో తెలియక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అధికార డీఎంకే తన మిత్రపక్షాలకు సీట్ల కేటాయింపులు ముగించి ప్రచార పర్వానికి సిద్ధమవుతోంది. అదే సమయంలో అన్నాడీఎంకే ఇప్పటివరకూ చిన్నాచితక పార్టీలతో పొత్తును కుదుర్చుకుని, ఓటు బ్యాంకు కలిగిన పీఎంకే, డీఎండీకేతో పొత్తును ఖరారు చేసుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోంది ఈ ఎన్నికలలో డీఎంకేతో దీటుగా మెగా కూటమిని ఏర్పాటు చేస్తానని ప్రకటించిన అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి ఈ రెండు పార్టీల రాక కోసం ఎదురుచూస్తున్నారు. వన్నియార్ల ఓటు బ్యాంక్ కలిగిన పీఎంకే మొదటి నుంచీ అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకునేందుకు ఆసక్తి కనబరిచింది. రెండు సార్లు అన్నాడీఎంకే సీనియర్ నేతలు పీఎంకే వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాందాస్‌తో సీట్ల సర్దుబాట్లపై చర్చలు జరిపారు కూడా. అయితే అన్నాడీఎంకే పొత్తు నిర్ణాయక కమిటీతో చర్చలు జరిపేందుకు పీఎంకే ఎవరినీ పంపలేదు. అంతేకాకుండా లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తును ఖరారు చేసుకోవాలనే విషయంపై పార్టీ నాయకులుగానీ, కార్యకర్తలు గానీ సోషల్ మీడియాలో ఎలాంటి సూచనలు, సలహాలు, ప్రకటనలు చేయకూడదంటూ పీఎంకే నేతలు నిషేధం విధించారు. రెండు విడతలుగా జరిగిన చర్చల్లో పీఎంకేకు ఏడు లోక్‌సభ నియోజకవర్గాలు, రాజ్యసభ సీటును కేటాయించేందుకు అన్నాడీఎంకే అంగీకరించింది. ఆ దిశగా ఓవైపు రాందాస్ అన్నాడీఎంకేతో మంతనాలు జరుపుతుండగా, మరోవైపు పార్టీ అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి బీజేపీ కూటమిలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. పీఎంకేకు తొమ్మిది లోక్‌సభ నియోజకవర్గాలు కేటాయించేందుకు బీజేపీ అంగీకరించడమే దీనికి కారణమని తెలుస్తోంది. అదే సమయంలో కేంద్ర మంత్రివర్గంలోనూ స్థానం కల్పించాలని అన్బుమణి పట్టుబడుతున్నట్లు చెబుతున్నారు. ఇదిలా ఉండగా పీఎంకేతో పొత్తును కుదుర్చుకునేందుకు కేంద్రమంత్రులు వీ.కే.సింగ్, కిషన్‌రెడ్డి సోమవారం చెన్నైకి రానున్నారు. మంత్రులతోపాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తదితర నేతలు కలిసి పీఎంకే నేతలతో పొత్తును ఖరారు చేసుకుంటారని తెలుస్తోంది. ఈ నెల 19న సేలంలో ప్రధాని మోదీ పాల్గొననున్న సభలో పీఎంకే నేతలను పాల్గొనేలా చేసేందుకు బీజేపీ రాష్ట్ర నాయకులు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. అదే సమయంలో పీఎంకేతో సీట్ల సర్దుబాట్లపై చర్చలు ఇంకా కొనసాగుతున్నాయని అన్నాడీఎంకే నేతలు చెబుతున్నారు. త్వరలోనే పీఎంకేతో పొత్తు ఖరారవుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.


పీఎంకే నేత డాక్టర్ రాందాస్


డీఎండీకే నాయకురాలు ప్రేమలత

డీఎండీకేది అదే దారి...

డీఎండీకే కూడా అన్నాడీఎంకే వైపు మొగ్గాలా? బీజేపీ కూటమిలో చేరాలో తెలియక తటపటాయిస్తోంది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత రెండు పార్టీల ఆఫర్లపై పరిశీలన జరుపుతున్నారు కానీ తుది నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. అన్నాడీఎంకే నేతలు ఈనెల 1న విరుగంబాక్కంలోని ప్రేమలత ఇంటికి వెళ్లి ఆమెతో తొలివిడత చర్చలు జరిపారు. ఆ తర్వాత ఆరో తేదీ అన్నాడీఎంకే కార్యాలయంలో డీఎండీకే నేతలు చర్చలు జరిపారు. ఆ తర్వాత మూడో విడత చర్చలు జరుగుతాయని రెండు పార్టీల నాయకులు ఆశించారు. కానీ సీట్ల సర్దుబాట్లు ఖరారు కాలేదు. రెండు పార్టీల మధ్య పొత్తు కుదరలేదు. గత పది రోజులుగా రెండు పార్టీల మధ్య ఎలాంటి చర్చలు జరగలేదు. శనివారం రెండు పార్టీల మధ్య పొత్తు ఖరారవుతుందని వార్తలు వెలువడ్డాయి. కానీ చివరిక్షణంలో చర్చలు జరగలేదు. అదేవిధంగా ఆదివారం రెండు పార్టీల మధ్య సీట్ల కేటాయింపులు ఖరావుతాయని ఊహాగానాలు చెలరేగాయి. అన్నాడీఎంకే కూటమిలో డీఎండీకేకు నాలుగు సీట్లు కేటాయించడం ఖాయమని చెబుతున్నారు. అదే సమయంలో రాజ్యసభ సీటు కూడా కేటాయించాలని అన్నాడీఎంకేపై ఒత్తిడి చేస్తోంది. అయితే డీఎండీకేకు రాజ్యసభ సీటును కేటాయించేందుకు అన్నాడీఎంకే నేతలు అంగీకరించడం లేదని తెలుస్తోంది. రాజ్యసభ సీటు వివాదం వల్లే రెండు పార్టీల మధ్య పొత్తు ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఏది ఏమైనప్పటికీ ఒకట్రెండు రోజుల్లో పీఎంకే, డీఎండీకేలు పొత్తుపై తుది నిర్ణయం తీసుకుంటాయిని తెలుస్తోంది.


ప్రధాని భద్రతాదళం ట్రయల్ రన్ - ఆర్‌ఎస్‌పురం వద్ద మెటల్ డిటెక్టర్లతో తనిఖీల్లో బాంబ్‌స్క్వాడ్

కోవైలో మోదీ పర్యటనకు
ఐదంచెల భద్రతా ఏర్పాట్లు

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులో రోడ్‌షో నిర్వహించేందుకు సోమవారం సాయంత్రం విచ్చేయనున్న ప్రధాని నరేంద్రమోదీకి పోలీసు ఉన్నతాధికారులు ఐదెంచెల భద్రతా ఏర్పాట్లు కల్పించనున్నారు. సుమారు ఐదువేల మంది పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొననున్నారు. ఆ నగరం సహా తుడియలూరు, సాయిబాబా కాలనీ, ఆర్‌ఎస్‌పురం ప్రాంతాల్లో డ్రోన్లు ఎగరవేయకూడదంటూ ఆంక్షలు విధించారు. గౌండం పాళయం జంక్షన్ నుంచి ఆర్‌ఎస్‌పురం తపాలా కార్యాలయం వరకు సుమారు మూడు కిలోమీటర్ల దూరం మోదీ రోడ్‌షోలో పాల్గొనున్నారు. ఆ రహదారికి ఇరువైపులా బీజేపీ, దాని మిత్రపక్షాలకు చెందిన కార్యకర్తలు, స్థానికులు చేత జెండాలు పట్టుకుని మోదీకి స్వాగతం పలకనున్నారు. ఆదివారం ఉదయం ఆ రహదారికి ఇరువైపులా పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్ల సమీపంలో బీజేపీ నాయకులు పార్టీ జెండాలను నాటారు. కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు రహదారికి ఇరువైపులా బ్లీచింగ్ పౌడర్ చల్లారు. స్థానిక పోలీసు అధికారులతో కలిసి కేంద్ర పారిశ్రామిక భద్రతాదళం అధికారులు, ప్రధాని ప్రత్యేక రక్షణ బృందం ఉన్నతాధికారులు భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. రోడ్‌షో నిర్వహించే రహదారిలో ఎస్‌పీజీ దళం ఉన్నతాధికారి ఏజీ రవూఫ్ నాయకత్వంలో పరిశీలన జరిపారు. అదే సమయంలో నగర పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో బాంబ్ స్క్వాడ్ మెటల్ డిటెక్టర్లతో రహదారి పొడవునా తనిఖీలు చేపట్టారు. రోడ్‌షో రహదారిలో మోదీ కారు వెంట ప్రయాణించనున్న వాహనాలతో ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. సోమవారం సాయంత్రం 5.30 గంటలకు ప్రధాని మోదీ కోయంబత్తూరు విమానాశ్రం చేరుకుంటారు. అక్కడి నుంచి కారులో సాయంత్రం 5.45 గంటలకు గౌండర్ పాళయంకు చేరుకుంటారు. అక్కడి నుంచి ఆయన ఆర్‌ఎస్ పురం తపాలా కార్యాలయం వరకు రోడ్‌షో జరుపుతారు. రాత్రి కోయంబత్తూరు సర్క్యూట్ హౌస్‌లో బస చేస్తారు.

బీజేపీని
ఓడించడమే లక్ష్యం

● ముంబై సభలో సీఎం స్టాలిన్

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించడమే ఇండియా కూటమి ఏకైక లక్ష్యమని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చెప్పారు. ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ ఏక్‌తా యాత్ర ముగింపు సందర్భంగా ముంబైలో ఆదివారం సాయంత్రం జరిగిన ఇండియా కూటమి నేతల బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ... దేశానికి బీజేపీకి మించిన పెనుముప్పు ఏదీ లేదని, ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న ఆ పార్టీని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ చేస్తున్న అసత్య ప్రచారాలను ఇండియా కూటమి సమర్థవంతంగా తిప్పికొడుతుందన్నారు. మోదీ గత పదేళ్లుగా చేసింది రెండు పనులేనని, ఒకటి విదేశీ పయనం, మరొకటి అసత్య ప్రచారమేనని ఎద్దేవా చేశారు. ఇండియా కూటమి అవినీతి కూటమి అంటూ దుష్ప్రచారం చేస్తున్న బీజేపీ ఎన్నికల బాండ్ల ద్వారా భారీస్థాయిలో విరాళాలు పొంది భారీ అవినీతికి పాల్పడిందన్నారు. ఎన్నికల బాండ్ల కుంభకోణంలో కూరుకుపోయిన బీజేపీకి ప్రధాని అభ్యర్థిగా ఉన్న మోదీ ప్రతి సభలో అవినీతి గురించి మాట్లాడటం గర్హనీయమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అరాచకాల వల్ల తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రాల్లో రాహుల్‌గాంధీ పాదయాత్ర నిర్వహించారని, దేశ సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడే దిశగా నిర్వహించిన ఆ యాత్ర విజయవంతమైందన్నారు. రాహుల్ నిర్వహించిన పాదయాత్ర ప్రధాని మోదీని తప్పకుండా ఓడించి తీరుతుందనే నమ్మకం తనకుందన్నారు. కన్నియాకుమారిలో ప్రారంభమైన రాహుల్ ఏక్‌తా యాత్ర ఢిల్లీని కైవశం చేసుకోవడంతో ముగియనుందని స్టాలిన్ పేర్కొన్నారు. కాగా ఈ సభలో స్టాలిన్ ఆంగ్లంలో క్లుప్తంగా ప్రసంగించారు.


ముంబై సభలో ప్రసంగిస్తున్న సీఎం స్టాలిన్


వేదికపై స్టాలిన్ , ఉద్ధవ్, రాహుల్

మళ్లీ విరుచుకుపడ్డ శ్రీలంక నావికా దళం

21మంది రామేశ్వరం జాలర్ల అరెస్టు


లంక నావికా దళం అదుపులో ఉన్న రామేశ్వరం జాలర్లు

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాదళం మళ్లీ తమిళ జాలర్లపై విరుచుకుపడింది. నాగపట్టినం జిల్లాకు చెందిన 15మంది జాలర్లను నిర్బంధించిన మూడు రోజులు కాకముందే మళ్లీ రామేశ్వరం జాలర్లను నిర్బంధించింది. తమ దేశ సముద్ర జలాల్లోకి ప్రవేశించారంటూ 21 మంది జాలర్లను అదుపులోకి తీసుకుంది. రామనాథపురం జిల్లా రామేశ్వరం నుంచి శనివారం వేకువజాము రెండు మరపడవల్లో 21 మంది జాలర్లు చేపలవేటకు బయలుదేరారు. వీరందరూ ఆదివారం వేకువజాము 1 గంట ప్రాంతంలో నెడుదీవికి సమీపంలో చేపలు పడుతుండగా ఐదు గస్తీ నౌకల్లో శ్రీలంక నావికాదళం చుట్టుముట్టి జాలర్లను అరెస్టు చేసింది. వీరందరిని శ్రీలంకలోని కాంగేశన్ ఓడరేవుకు తరలించారు. ఇదిలా ఉండగా రామేశ్వరం జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్టు చేయడాన్ని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాస్ ఖండించారు. జాలర్లను విడిపించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నేడు జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సమావేశం

ప్యారీస్, మార్చి 17: లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించిన నేపథ్యంలో, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లు, నిర్వహణపై సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం కానున్నారు. సచివాలయ ప్రాంగణంలో సాయంత్రం 3 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్లు, కార్పొరేషన్ల అధికారులు హాజరు కానున్నారు. నేరుగా పాల్గొనలేని కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించే ఏర్పాట్లు సిద్ధం చేశారు. శనివారం సాయంత్రం నుంచే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు ఆధీనంలోకి వచ్చాయి. పథకాలకు సంబంధించిన ఫైళ్లపై నిర్ణయం తీసుకోవాలంటే అందుకు ఈసీ అనుమతి పొందాల్సి ఉంటుంది. ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు రాష్ట్రవ్యాప్తంగా 234 ఎమ్మెల్యేల కార్యాలయాలు, 39 ఎంపీల కార్యాలయాలు ఖాళీ చేయాల్సిందిగా ఆయా జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సమీక్షా సమావేశంలో ఎన్నికలకు సంబంధించిన సూచనలు ఇవ్వనున్నారు. ఎన్నికల నిర్వహణ పనుల్లో పాల్గొనే అధికారుల గురించి, నామినేషన్ దాఖలు ప్రక్రియ సమయంలో నిబంధనలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల పనులకు ఎంపికైన అధికారులకు తగిన శిక్షణ తదితర అంశాలపై చర్చిస్తారు. ఓటరు జాబితాలో కొత్తగా పేరు చేర్చే గడువు ఆదివారంతో ముగియడంతో 18 ఏళ్లు నిండిన యువ ఓటర్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. మరి కొంత మంది ఈసీ ప్రకటించిన కార్యాలయాలకు నేరుగా వెళ్లి పూర్తిచేసిన దరఖాస్తులు సమర్పించారు.


సత్యప్రదసాహు

ఐటీ కంట్రోల్ రూం...

ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా వ్యవహరించే పార్టీల కదలికలను పర్యవేక్షించేందుకు ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూం ఏర్పాటైంది. ఓటర్లకు నగదు, బహుమతులు పంపిణీపై నెం. 18004256669, 9445394453కు పిర్యాదు చేయవచ్చు.

పుదుచ్చేరి బీజేపీ అభ్యర్థి ఎంపికకు
రూ.50 కోట్ల బేరం

● స్వతంత్ర ఎమ్మెల్యే శివశంకరన్ ఆరోపణ

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ఎంపికకు ఆ పార్టీ రాష్ట్ర శాఖ రూ.50 కోట్లకు బేరమాడుతోందని స్వతంత్ర ఎమ్మెల్యే శివశంకరన్ ఆరోపించారు. పుదుచ్చేరిలో ఎన్డీయే తరపున బీజేపీ అభ్యర్థి పోటీ చేయనున్నారు. అభ్యర్థిని ఖరారు చేసేందుకు ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి నిర్మల్‌కుమార్ స్థానిక నాయకులు, శాసనసభ్యులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కారైక్కాల్‌కు చెందిన పారిశ్రామికవేత్త రాజశేఖరన్‌ను బీజేపీ అభ్యర్థిగా సిఫారసు చేస్తూ పార్టీ అధిష్ఠానానికి ప్రతిపాదన పంపాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఎన్ఆర్ కాంగ్రెస్- బీజేపీ కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న స్వతంత్ర ఎమ్మెల్యే శివశంకరన్ విలేఖరులతో మాట్లాడుతూ... పుదుచ్చేరి ఎంపీ సీటుకు బీజేపీ అభ్యర్థిగా కారైక్కాల్ పారిశ్రామికవేత్త రాజశేఖరన్‌ను ఎంపిక చేసినప్పుడు స్థానిక నాయకులు వ్యతిరేకించారని తెలిపారు. బీజేపీ రాష్ట్ర కమిటీకి రూ.50 కోట్లు ఇస్తేనే సీటు గ్యారెంటీ అంటూ కొంత మంది నేతలు బేరమాడుతున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని బీజేపీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు.



చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో మక్కల్ నీది మయ్యం అధినేత కమలహాసన్ డీఎంకే నేతలతో కలిసి ఉమ్మడి ప్రచారం సాగించనున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఎంఎన్ఎం పార్టీ కార్యాలయంలో కమల్‌తో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికల ప్రచార వ్యూహంపై సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశానంతరం మంత్రి రాజా తన ఎక్స్‌లో సందేశం వెలువరించారు. కేంద్రంలో పదేళ్లుగా సాగుతున్న ఫాసిస్టు ప్రభుత్వాన్ని ఓడించే దిశగా కమల్ డీఎంకే నేతలతో కలిసి ఉమ్మడి ప్రచారం చేయనున్నారని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి నుంచి కలైజ్ఞాని బిరుదు పొందిన కమల్ మతతత్వ శక్తులను పారద్రోలాలని కంకణం కట్టుకున్నారన్నారు. రెండు పార్టీల భేటీ విజయయాత్రకు శ్రీకారం అని అభివర్ణించారు.


కమల్‌తో చర్చిస్తున్న మంత్రి టీఆర్‌బీ రాజా

కమల్‌తో మంత్రి రాజా భేటీ

● ఎన్నికల ప్రచార వ్యూహంపై చర్చలు

రంజాన్ వేళలు
సోమవారం : ఇఫ్తార్ : సాయంత్రం - 6.27
మంగళవారం : సహర్ : ఉదయం - 4.33



మంత్రిగా పొన్ముడి ప్రమాణ స్వీకారానికి గవర్నర్ బ్రేక్



చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఉత్తర్వు ప్రకారం మళ్లీ శాసనసభ్యత్వం పొందిన మాజీ మంత్రి పొన్ముడికి ప్రమాణ స్వీకారం చేయించే ప్రసక్తే లేదంటూ రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి ప్రకటించారు. అక్రమార్జన కేసులో పొన్ముడికి హైకోర్టు విధించిన జైలు శిక్షపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందే తప్ప ఆయనను నిర్దోషిగా ప్రకటించలేదన్నారు. నిర్దోషిగా తీర్పు రాకపోవడంతో పొన్ముడిని మంత్రిగా ప్రమాణస్వీకారం చేసేందుకు అనుమతించబోనని స్పష్టం చేశారు.

శ్రీవిల్లిపుత్తూరులో ఆండాళ్ కల్యాణోత్సవాలు ప్రారంభం

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లాలోని సుప్రసిద్ధ వైష్ణవ దివ్యదేశం శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ ఆలయంలో పంగుణి ఉత్తిర కల్యాణోత్సవాలు ఆదివారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి.ఈఆలయంలో యేటా పంగుణి ఉత్తిరం పర్వదినాన ఆండాళ్, రంగమన్నార్ల తిరుకల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ వేడుకలకు దేశ విదేశాల నుంచి వేలాదిమంది భక్తులు పాల్గొంటారు. ఈ యేడాది తిరుకల్యాణ ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ముందుగా ఆండాళ్ రంగమన్నార్లకు ప్రత్యేక తిరుమంజనం నిర్వహించారు.విశేష అలంకరణలతో ఆండాళ్, రంగమన్నార్ సన్నిధిలో వేంచేశారు. ఉదయం 9.30 గంటలకు వృషభ లగ్నంలో ధ్వజారోహణాన్ని ఆలయ ప్రధానార్చకుడు సుదర్శన భట్టర్, వైష్ణవ పండితుల మంత్రోచ్చాటనలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించారు. ఆ తర్వాత ధ్వజస్తంభానికి అభిషేకం, కర్పూర హారతి ఇచ్చారు. ఈ వేడుకల్లో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఆండాల్ తిరుకల్యాణం ఆలయం ముందువైపు నిర్మించిన భారీ పందిరి దిగువ ఈనెల 25 రాత్రి 7గంటలకు నిర్వహించనున్నారు.


ధ్వజారోహణం చేస్తున్న ఆలయ ప్రధానార్చకులు

సమాచార దర్శిని

ప్రభుత్వ కార్యాలయాల్లో ఫిర్యాదుల పెట్టెలు

పెరంబూర్, మార్చి 17: ప్రజలు, రైతులు, దివ్యాంగులు సహా అన్ని వర్గాల వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించేలా ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో గ్రీవెన్స్ నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో, లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో జిల్లా అధికారులందరూ ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. అందువల్ల సోమవారాలు నిర్వహించే గ్రీవెన్స్ ఎన్నికలు ముగిసే వరకు రద్దు చేస్తున్నట్లు, ప్రజలు మన సమస్యలతో కూడిన వినతిపత్రాలను కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన ఫిర్యాదుల పెట్టెలో వేయాలని అధికారులు సూచించారు.

నాలుగు పోలీస్‌స్టేషన్లకు ఐఎస్ఓ సర్టిఫికెట్

పెరంబూర్, మార్చి 17: స్థానిక అడయార్ పోలీసు జిల్లా పరిధిలోనా నాలుగు పోలీస్‌స్టేషన్లకు ఐఎస్ఓ సర్టిఫికెట్ లభించింది. ప్రజలతో పోలీసులు మర్యాదగా నడుచుకోవడం, కేసులకు సంబంధించిన దస్త్రావేజులు సక్రమంగా పర్యవేక్షించడం, త్వరితగతిన విచారించడం సహా 20 అంశాలను పరిగణలోకి తీసుకొని పోలీస్‌స్టేషన్లకు ఐఎస్ఓ సర్టిఫికెట్ అందిస్తుంటారు. ఈ మేరకు గిండి, వేళచ్చేరి, నీలాంగరై, తరమణి పోలీసుస్టేషన్లు ఈ సర్టిఫికెట్‌కు ఎంపికైనట్లు అధికారులు తెలిపారు.

జిల్లా స్థాయి క్రికెట్ క్రీడాకారుల ఎంపిక శిబిరాలు

పెరంబూర్, మార్చి 17: తిరువళ్లూర్ జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో పలు విభాగాల్లో క్రికెట్ క్రీడాకారుల ఎంపిక రెడ్‌హిల్స్ సమీపంలోని గోజన్ కళాశాలలో ఏప్రిల్ 11 నుంచి 14వ తేది వరకు జరగనుంది. 12 ఏళ్ల లోపు బాలికలు, 14, 16, 19 ఏళ్ల బాలురు అని మొత్తం నాలుగు విభాగాల్లో ఎంపిక చేయనున్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈనెల 20వ తేదీలోపు అంబత్తూర్ ఎంటీహెచ్ రోడ్డులోని సంఘ కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవచ్చు. వివరాలకు నెం.9444441817, 9840482220, 9444329232లలో సంప్రదించవచ్చు.

'ఉంగల్ తేడి ఉంగల్ ఊరిల్' పథకానికి నిధుల పెంపు

పెరంబూర్, మార్చి 17: 'ఉంగల్ తేడి ఉంగల్ ఊరిల్' పథకం కింద శిబిరాలు నిర్వహించే ఖర్చును రూ.20,000 నుంచి రూ.50,000కు పెంచారు. చెన్నై మినహా మిగిలిన జిల్లాల్లో 'ఉంగల్ తేడి ఉంగల్ ఊరిల్ పథక శిబిరం ప్రతి నెలా మూడో బుధవారం ఏదో ఒక గ్రామంలో నిర్వహిస్తున్నారు. ఒక్కో శిబిరం నిర్వహణకు రూ.20,000 చొప్పున అందించేలా రాష్ట్రప్రభుత్వం రూ.88.80 లక్షలు కేటాయించింది. ఈ నేపథ్యంలో, ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిర్వహించిన సమావేశంలో, శిబిరం నిర్వహణకు రూ.20,000 సరిపోవడం లేదని పలు జిల్లాల కలెక్టర్లు విజ్ఞప్తి చేశారు. దీంతో, శిబిరం నిర్వహణ ఖర్చు రూ.50,000 పెంచుతూ అదనంగా రూ.99.90 లక్షలు కేటాయిస్తూ రెవెన్యూ శాఖ కార్యదర్శి రాజారామన్ జీవో విడుదల చేశారు.

అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మార్చి 17: రాష్ట్రంలోని వైద్య విభాగంలో వైద్యులు, నర్సులు సహా పలు పోస్టుల భర్తీని వైద్య ఉద్యోగుల ఎంపిక బోర్డు చేపట్టింది. ఇందులో భాగంగా ఖాళీగా ఉన్న 2,533 అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. యూజీసీ గుర్తింపు పొందిన యూనివర్శిటీ, కళాశాలల నుంచి ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై, ఏడాది పాటు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఇంటర్న్‌షిప్ చేసి ఉండాలి.ఈ ఉద్యోగానికి రూ.56,100- రూ.1,77,500 వేతనం ఇవ్వనున్నారు. కరోనా కాలంలో పనిచేసిన వారికి ప్రోత్సాహక మార్కులు అందజేస్తారు. త్వరలో ఆన్‌లైన్ రాతపరీక్ష తేది ప్రకటించనున్నారు. అర్హులైన వారు www.mrb.tn.gov.in లో దరఖాస్తు చేసుకోవచ్చు.

గ్రాము బంగారానికి రూ4,500 రుణం

పెరంబూర్, మార్చి 17: సహకార శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న రాష్ట్ర ప్రధాన సహకార, జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాలు బంగారానికి రుణాలు అందిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన సహకార సంఘాల బ్యాంకుల్లో గ్రాము బంగారానికి రూ.4,200 అందిస్తున్నారు. కొద్దిరోజులుగా బంగారం ధర రూ.6,150 ఉండడంతో, సహకార సంఘాలు అందించే రుణాలు రూ.4,200 నుంచి రూ.4,500 పెంచాలని సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

పెరంబూర్, మార్చి 17: లోక్‌సభ ఎన్నికల్లో డీఎండీకే తరఫున పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న వారు ఈనెల 18వ తేది నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత పేర్కొన్నారు. కోయంబేడులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి దరఖాస్తులు స్వీకరించి, పూర్తిచేసి మరుసటిరోజు సాయంత్రం 5 గంటల్లోపు కార్యాలయంలో సమర్పించాలి. పోటీ చేయగోరు వారు జనరల్ నియోజకవర్గానికి రూ.15,000, రిజర్వు నియోజకవర్గాలకు రూ.10,000 చొప్పున దరఖాస్తుతో సమర్పించాలి.

తుపాకులు అప్పగించండి

● నగర పోలీసు శాఖ

పెరంబూర్, మార్చి 17: నగర పరిధిలో లైసెన్స్‌తో ఉపయోగిస్తున్న 2,125 మంది తమ తుపాకులను పోలీస్‌స్టేషన్‌లలో అప్పగించాలని నగర పోలీసు శాఖ పేర్కొంది. లోక్‌సభ ఎన్నికల నిబంధనలు అమల్లోకి రావడంతో యజమానులు సత్వరం తమ తుపాకులు పోలీస్‌స్టేషన్లలో అప్పగించాలని తెలియజేసింది.

ఉచిత ఆయుర్వేద, హోమియోపతి శిబిరం

వేలూరు, మార్చి 17: స్థానిక పిల్లర్ బెడ్ రోడ్డులో ఉన్న ఉపాధ్యాయుల హోంలో ఆదివారం మెర్సి ఆయుర్వేదం, హోమియోపతి హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఈ శిబిరంలో చర్మానికి సంబంధించిన వ్యాధులు, ఆస్తమా, పెరాలసిస్ సహా పలు వ్యాధులపై డాక్టర్ జూలీస్ స్టీఫెన్ వైద్యపరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు.

మత్తుమాత్రల స్వాధీనం

ఐసిఎఫ్, మార్చి 17: స్థానిక ఆవడి సమీపంలో ఎంటీసీ బస్సులో తరలిస్తున్న మత్తు మాత్రలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వాహన తనిఖీలు ముమ్మరమయ్యాయి. ఆవడి సమీపం కోవిల్‌పతాకం జగ్జీవన్ రాం విగ్రహం వద్ద తనిఖీలు చేపట్టిన అధికారులు ఆవడి నుంచి రెడ్‌హిల్స్ వెళ్తున్న ఎంటీసీ బస్సును ఆపారు. గమనించిన బస్సు వెనుక సీట్లలో కూర్చున్న ముగ్గురు యువకులు తమ చేతుల్లోని బ్యాగులు వదిలేసి పారిపోయారు. వారిని ఇతర సిబ్బంది వెంబడించారు. ఇంతలో బ్యాగులను పరిశీలించగా వాటిలో మాత్రలు ఉన్నట్టు గుర్తించారు. కొద్దిదూరంలో ఉన్న మైదానం పొదల్లో దాక్కున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా, హైదరాబాద్ నుంచి హోల్‌సేల్‌గా మత్తుమాత్రలు కొనుగోలు చేసి, ఆవడి, చుట్టుపక్కల ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. పరారైన మరో వ్యక్తి కోసం గాలిస్తున్నారు. కాగా మాత్రల విలువ రూ.20 లక్షల వరకు ఉండొచ్చని భావిస్తున్నారు.

చెన్నై జిల్లాలో 579 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

● ఎన్నికల అధికారి రాధాకృష్ణన్



పెరంబూర్, మార్చి 17: చెన్నై జిల్లా పరిధిలో 579 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా ఉన్నట్టు గుర్తించామని, జిల్లావ్యాప్తంగా 48 పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జె.రాధాకృష్ణన్ తెలిపారు. ఎన్నికల సంబంధించిన ఏర్పాట్లను శనివారం స్థానిక రిప్పన్ భవనంలో రాధాకృష్ణన్ వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యాయి. సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... జిల్లా పరిధిలోని 16 శాసనసభ నియోజకవర్గాల్లో తలా ఒక పర్యవేక్షణాధికారి, ఫ్లయింగ్ స్క్వాడ్ కూడిన వీడియో చిత్రీకరణ బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. చెక్‌పోస్ట్‌లను పర్యవేక్షించేలా 360 డిగ్రీలు వీక్షించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో మొత్తం 40 లక్షల మంది ఓటర్లున్నారని, వారి కోసం 944 ప్రాంతాల్లో 3,719 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. వీటిలో 579 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. ఎన్నికల్లో విధుల్లో 23,122 మంది ఉద్యోగులు పాల్గొంటున్నారన్నారు. ప్రజలు ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై 1950, 18004257012 నెంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని రాధాకృష్ణన్ కోరారు.

ఒకే విడతలో ఎన్నికలు జరిపించవచ్చు కదా?

● మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు కమల హాసన్



కమల హాసన్

పెరంబూర్, మార్చి 17: ఒకే విడతలో ఎన్నికలు జరిపేలా చర్యలు చేపట్టవచ్చు కదా అంటూ మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు కమలహాసన్ ప్రశ్నించారు. 'ఒకే దేశం...ఒకే ఎన్నిక' పథకం సాధ్యాసాధ్యాలను పరిశీలింలి నివేదిక అందజేయాలని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ కమిటీ, ఎన్నికల సంఘం, పలు రాజకీయపార్టీలు, ప్రజల సేకరించిన అభిప్రాయాలతో కూడిన 18,000 పేజీల నివేదికను ఇటీవల రాష్ట్రపతికి అందజేసింది. అందులో, లోక్‌సభ, శాసనసభలకు ఒకే సమయంలో మొదట విడత ఎన్నికలు, అనంతరం 100 రోజుల వ్యవధిలో స్థానిక సంస్థలకు రెండో విడతలో జరుపవచ్చని నివేదికలో పేర్కొంది. ఈ నేపథ్యంలో, మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు కమల్ తన 'ఎక్స్'లో ఒకే దేశం ఒకే ఎన్నికల నిర్వహణకు యత్నించే ముందు, తక్కువగా ఒకే విడతలో ఒకే ఎన్నికలు నిర్వహించవచ్చు కదా? అంటూ ప్రశ్నించారు. కాగా, లోక్‌సభ ఎన్నికలు 7 విడతల్లో నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘ ప్రకటించిన నేపథ్యంలో, కమల్ ఇలాంటి ప్రశ్న లేవనెత్తారు.

చిన్నాలంపట్టి ఆసుపత్రిలో ఆరోగ్యశాఖ మంత్రి ఆకస్మిక తనిఖీ



చిన్నాలంపట్టి ఆసుపత్రిలో తనిఖీ నిర్వహిస్తున్న సుబ్రమణ్యం

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ నగరంలో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లిన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం మార్గమధ్యంలో చిన్నాలంపట్టి ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. అవుట్ పేషంట్ల విభాగంలో అందిస్తున్న చికిత్సలను గురించి రోగుల వద్ద అడిగి తెలుసుకున్నారు. ఆ విభాగంలో అవుట్‌పేషంట్లకు ముద్రించిన ఓపీ చిట్టీలకు బదులుగా తెల్లకాగితపు ముక్కలను ఓపీ చిట్టీలుగా ఇవ్వడం పట్ల మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముద్రించిన ఓపీ చిట్టీలనే ఇవ్వాలని ఆదేశించారు. మందుల గోదాములో కొన్ని మందులు నేలపై చెల్లాచెదురుగా పడి ఉండటం చూసి సిబ్బందిపై మండిపడ్డారు. ఆ ఆసుపత్రిలో నెలల తరబడి మూసివున్న 30 పడకల వార్డును మంత్రి తెరిచి పరిశీలించారు.వీలైనంత త్వరగా తెరచిరోగులకు చికిత్సలందించాలనిఆదేశించారు.

వైభవంగా విల్వనాథీశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు



వేలూరు, మార్చి 17: కాట్పాడి సమీపం తిరువలం పొన్నే నది తీరంలో పురాతనమైన వినాయకుడి ప్రత్యేక సన్నిధి ఉంది. తిరువలంలో ఉన్న విల్వనాథీర్వుడి ఆలయంలో యేటా బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఈ ఏడాది వేడుకలు ఆదివారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయంలో విశేష అభిషేక ఆరాధనలు, ప్రత్యేక అలంకరణలు జరిగాయి. ఉత్సవ మూర్తులను మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ ధ్వజస్తంభం వద్ద అర్చకుల వేదమంత్రాల నడుమ ధ్వజస్తంభంపై పతాకాన్ని ఎగురవేశారు.

ఎన్నికల నిబంధనలపై సమీక్షా సమావేశం



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి



వేలూరు, మార్చి 17: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం జరిగింది.. సమావేశానికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎస్పీ మణివన్నన్, జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, కార్పొరేషన్ కమిషనర్ జానకి రవిచంద్రన్, జిల్లా కలెక్టర్ పీఏ (ఎన్నికలు) దేవరాజ్, అసిస్టెంట్ ఎన్నికల అధికారులు కాట్పాడి- కలియమూర్తి, ఆనైకట్టు- మురుగన్, కేవీకుప్పం- సుమతి, వేలూరు- కవిత, గుడియాత్తం- సుబ్బులక్ష్మి, వాణియంబాడి- అజీత్ బేగం, ఆంబూరు- మిలిక్స్‌రాజ సహా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నివాసంలో 13 సవర్ల నగలు చోరీ

● త్రిపుర యువకుడి అరెస్ట్

ప్యారీస్, మార్చి 17: స్థానిక షోళింగనల్లూర్‌లో కాంట్రాక్టర్ ఇంట్లో 13 సవర్ల నగలు దోచుకున్న త్రిపుర యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. గోవిందరాజ్ అనే బిల్డింగ్ కాంట్రాక్టర్ ఇంట్లో ఉన్న బీరువాలో దాచిన 13 సవర్ల నగలు కనిపించడం లేదని ఈ నెల 9వ తేదీన సెమ్మంజేరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి విచారణ చేపట్టిన పోలీసులు నగరంలోని ఓ ప్రముఖ హోటల్‌లో సర్వర్‌గా పనిచేస్తున్న త్రిపురకు చెందిన మసీర్‌హుస్సేన్ (21)ని శనివారం అరెస్ట్ చేసి, చోరీ చేసిన నగలు కూడా స్వాధీనం చేసుకున్నారు. అతన్ని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

విజయ్ పార్టీలో సభ్యత్వ నమోదు నిలిపివేత

ప్యారీస్, మార్చి 17: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన కారణంగా నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రిక్కళగం తరఫున సభ్యత్వ నమోదును ఆదివారం నుంచి నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. స్థానిక పనయూర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆదివారం విజయ్ అధ్యక్షతన నిర్వహించదలచిన రాష్ట్రస్థాయి పార్టీ నిర్వాహకుల సమావేశాన్ని కూడా రద్దు చేశారు. అలాగే, పేదల కోసం ప్రకటించిన సంక్షేమ సహాయాల పంపిణీని కూడా ఎన్నికల కారణంగా తాత్కాలికంగా వాయిదా వేశారు.

నేడు సీపీఐ అభ్యర్థుల జాబితా విడుదల

ఐసిఎఫ్, మార్చి 17:లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ తరఫున పోటీచేయనున్న అభ్యర్థుల పేర్లు సోమవారం వెల్లడిస్తామని ఆపార్టీ రాష్ట్రకార్యదర్శి ముత్తరసన్ తెలిపారు.డీఎంకేకూటమిలో సీపీఐకి నాగపట్టినం, తిరుప్పూర్ స్థానాలు కేటాయించారు.ఈనేపథ్యంలో సోమవారం నిర్వహించనున్న రాష్ట్రకార్య వర్గ సమావేశంలో అభ్యర్థుల పేర్లు ఖరారు చేయనున్నట్లు ముత్తరసన్ తెలిపారు.



రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న అధ్యక్షులు, ప్రముఖుల ఫొటోలు తొలగిస్తున్న ఉద్యోగులు

రాష్ట్రంలో ఒకే విడతలో ఎన్నికలు
మోదీకీ ముందే ఎలా తెలుసు?

● కాంగ్రెస్, డీపీఐ నేతల ప్రశ్న

ప్యారీస్, మార్చి 17: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు ఒకే విడతలో జరుగుతాయని ప్రధాని నరేంద్రమోదీకి ఎలా తెలిసిందని కాంగ్రెస్, డీపీఐలు ప్రశ్నించాయి. ఈ మేరకు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై, దళిత్ పాంథర్స్ ఆఫ్ ఇండియా (డీపీఐ) అధ్యక్షుడు, ఎంపీ తిరుమావళవన్ ప్రశ్నించారు. ముంబై వెళ్లే ముందు విమానాశ్రయంలో సెల్వపెరుందగై మాట్లాడుతూ... తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 40 నియోజకవర్గాల్లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ రాహుల్ గాంధీ సుడిగాలి పర్యటన చేపడతారన్నారు. గత ఎన్నికల కంటే ఈసారి అధిక మెజార్టీతో ఇండియా కూటమిని గెలిపించేలా వారు ప్రచారం చేస్తారన్నారు. ఎలక్టోరల్ బాండ్లను విడుదల చేయాలని కాంగ్రెస్ ముందే డిమాండ్ చేసిందని, ఈ డిమాండ్ ఎస్బీఐ ముందు ఆందోళన కూడా నిర్వహించిందన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలతో పాటు ఎన్నికల కమిషన్ కూడా ప్రధాని నరేంద్రమోదీకి అనుకూలంగా పనిచేస్తున్నాయన్నారు. దీనికి నిదర్శనమే, రాష్ట్రంలో ఒకే విడత ఎన్నికలు జరుగుతాయని మోదీ పేర్కొనడమన్నారు. డీపీఐ ఎంపీ తిరుమావళవన్ మాట్లాడుతూ... ఏడు దశల్లో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడంపై నిర్ణయం తీసుకున్న ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా పని చేయలేదని విమర్శించారు. ప్రధాన పార్టీల మధ్య ఇంకా పొత్తులు ఖరారు కాలేదని, ఈ పరిస్థితుల్లో ఈనెల 20వ తేది నుంచి నామినేషన్ దాఖలు ప్రారంభమవుతుందని ప్రకటించడం వల్ల రాజకీయపార్టీలు సందిగ్ధంలో పడ్డాయన్నారు. తొలివిడత ఎన్నికల పోలింగ్‌కు ఏడో విడతకు మధ్య చాలా సమయం ఉందని, ఫలితాలు ప్రకటించేందుకు 45 రోజులు అవసరమా అని తిరుమా ప్రశ్నించారు.


సీసీ కెమెరా ఫుటేజీ 18 నెలలు భద్రపరచాలి

పెరంబూర్, మార్చి 17: పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఫుటేజీని 18 నెలలు భద్రపరిచాలంటూ ఆదేశాలు జారీ అయ్యాయి. రాష్ట్రంలోని పోలీస్‌స్టేషన్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సక్రమంగా పర్యవేక్షించడం లేదనే ఆరోపణలున్నాయి. అందువల్లే తూత్తుకుడిలో విచారణకు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చిన జయరాజ్, ఆయన కుమారుడు ఫినిక్స్‌పై పోలీసులు దాడిచేసిన దృశ్యాలకు సంబంధించిన ఫుటేజీ భద్రపరచలేదు. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరా ఫుటేజీ 30 నుంచి 40 రోజులు మాత్రమే భద్రపరిచే సౌకర్యముంది. ఈ విషయమై హైకోర్టులో ఉత్తర్వులతో, పోలీస్‌స్టేషన్‌లోని ఫుటేజీ 12 నెలల నుంచి 18 నెలల వరకు భద్రపరిచేలా అవసరమైన సాంకేతిక పరికరాలు కొనుగోలు చేయాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు సత్వర సహాయాల పంపిణీ

పెరంబూర్, మార్చి 17: ఊహించని ప్రమాదాల్లో చిక్కుకున్న విద్యార్థులకు సత్వరం నివారణ సహాయం అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాధికారులకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలకు వచ్చే, వెళ్లే సమయాలు, పాఠశాలల్లో జరిగే కార్యక్రమాలు, పాఠశాల తరఫున విహారయాత్రలకు వెళ్లిన సమయాల్లో ఊహించని విధంగా ప్రమాదాల్లో చిక్కుకొని మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.లక్ష, తీవ్రంగా గాయపడిన విద్యార్థులు రూ.50,000, స్వల్పంగా గాయపడిన వారికి రూ.25,000ను ప్రభుత్వం అందజేస్తోంది. బాధిత విద్యార్థులకు సహాయం అందజేయడంలో జాప్యం జరుగుతుందనే ఫిర్యాదులపై స్పందించిన పాఠశాల విద్యాశాఖ, నివారణ సహాయాలు జాప్యం లేకుండా అందించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

కార్చిచ్చును ఆర్పేందుకు హెలికాప్టర్ వినియోగం



మంటలపై హెలికాప్టర్‌తో నీరు చల్లుతున్న దృశ్యం

పెరంబూర్, మార్చి 17: నీలగిరి జిల్లా కున్నూర్ ఫారెస్ట్ డెల్ ప్రాంతంలో ఈ నెల 12న తేయాకు తోటల్లో చెలరేగిన మంటలు సమీపంలోని అడవికి వ్యాపించాయి. అటవీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అని మొత్తం 100 మంది నాలుగు రోజులుగా మంటలు ఆర్పే పనుల్లో నిమగ్నమయ్యారు. అయినా మంటలు అదుపులోకి రాకపోవడంతో, కున్నూర్ వైమానిక దళం నుంచి హెలికాప్టర్ రప్పించారు. హెలికాప్టర్‌కు అమర్చిన బక్కెట్‌లో రేలియా నది నుంచి నీరు తీసుకొచ్చి మంటలపై చల్లే పనులు చేపట్టారు. మొత్తం 10,000 లీటర్ల సామర్థ్యం కలిగి ఈ బక్కెట్ నుంచి నాలుగు సార్లు నీళ్లు చల్లారు. అయినా ఒక వైపు మాత్రమే మంటలు అదుపులోకి రాగా, పక్క ప్రాంతాలకు పాకిన మంటలు అదుపుచేసేలా ఆదివారం కూడా హెలికాప్టర్ వినియోగించారు. ఈ పనులను జిల్లా కలెక్టర్ అరుణ పర్యవేక్షించారు.

శివకాశిలో బోట్ సవారీ ప్రారంభం



పడవ సవారీలో పర్యాటకులు

పెరంబూర్, మార్చి 17: విరుదునగర్ జిల్లా శివకాశిలోని పెరియకుళం జలాశయంలో పడవ సవారీ ప్రారంభమైంది. ఆదివారం ఉదయం రక్షణ దుస్తులు ధరించిన పర్యాటకులు ఉత్సాహంగా సవారీలో పాల్గొన్నారు. జలాశయం పూర్తిగా నిండిన నేపథ్యంలో మధ్యలో మియవాకీ అడవి ఏర్పాటు చేశారు. ఈ అడవి చుట్టూ తిరిగి వచ్చేలా పడవ సవారీకి జిల్లా యంత్రాంగం అనుమతించింది.

బీజేపీ కూటమి గెలుపునకు కృషి



నేతలు, కార్యకర్తలతో ఏసీ షణ్ముగం

వేలూరు, మార్చి 17: లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ కూటమి గెలుపొందేలా కార్యకర్తలు కృషి చేయాలని పుదియ నీతి కట్చి వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసీ షణ్ముగం పిలుపునిచ్చారు. బెంజ్ పార్క్ హోటల్‌లో ఆదివారం పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏసీ షణ్ముగం మాట్లాడుతూ... వేలూరు స్థానంలో తాను పోటీ చేసే అవకాశముందని తెలిపారు. సమావేశంలో మేనేజింగ్ అధ్యక్షుడు రవికుమార్, జీపీకే బాలాజి, కరాటే రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత సహా నలుగురి అరెస్ట్

పెరంబూర్, మార్చి 17: స్థానిక అశోక్ నగర్, తరమణి, వాషర్‌మెన్‌పేట ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న మహిళ సహా నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. సెయింట్ థామస్ మౌంట్ పోలీసులు శనివారం అశోక్‌నగర్ 2వ అవెన్యూలో వాహన తనిఖీలు చేపట్టారు. తేని జిల్లా ఉత్తమపాళయానికి చెందిన దినేష్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని అతన్నుంచి 15 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అలాగే, తరమణి రౌండ్ ఠానా సమీపంలో ఆటో, కారులో గంజాయి తరలిస్తున్న మడిపాక్కం రాఘవేంద్ర నగర్‌కు చెందిన వనిత, కన్నగి నగర్‌కు చెందిన శ్రీనివాసన్‌ను అరెస్ట్ చేసి, వారినుంచి 10.2 కిలోల గంజాయి, కారు, ఆటో స్వాధీనం చేసుకున్నారు. ఇక, వాషర్‌మెన్‌పేటలో తనిఖీలు చేపట్టిన పోలీసులు వ్యాసర్పాడి కల్యాణపురం 6వ వీధికి చేరిన శక్తివేలును అరెస్ట్ చేసి, అతని నుంచి 4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

ఆరుద్ర గోల్డ్ ట్రేడింగ్ మోసం కేసులో
400మంది ఏజెంట్ల 86 ఆస్తుల స్తంభన

ప్యారీస్, మార్చి 17: ఆరుద్ర గోల్డ్ ట్రేడింగ్ మోసం కేసులో 400 మంది ఏజెంట్లకు చెందిన 86 ఆస్తులను ఆర్థిక నేర విభాగం పోలీసులు స్తంభింపజేశారు. ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు, 7,000 మంది ఏజెంట్లను గుర్తించి డిపాజిట్‌దారులను నమ్మించి మోసం చేయాలన్న ఉద్దేశంతో ఆరుద్ర సంస్థలో పెట్టుబడులు చేయించిన 500 మంది ఏజెంట్లలో 400 మందికి సమన్లు జారీ చేశారు. దీనిపై నిర్వహించిన విచారణలో, వారు కమీషన్‌గా పొంది కొనుగోలు చేసిన 86 ఆస్తులను స్తంభింపజేశారు. మరో 100మంది ఏజెంట్ల బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేశారు. కాగా, రూ.2,438 కోట్లు మోసం చేసిన ఆరుద్ర గోల్డ్ ట్రేడింగ్ కేసులో ఇప్పటివరకు 25 మందిని అరెస్ట్ చేశారు. ఇప్పటికే రూ.96 కోట్ల బ్యాంక్ ఖాతాలు, 108 స్థిరాస్తులను గుర్తించి స్తంభింపజేయడం గమనార్హం.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీల్లో ఫ్లయింగ్ స్క్వాడ్

వేలూరు, మార్చి 17: లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. శనివారం రాత్రి నుంచే స్థానిక అన్నాసాలై సహా పలు ప్రాంతాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. నగదు, బహుమతులు అక్రమంగా తరలిస్తున్నారా అంటూ అధికారులు ఆరా తీస్తున్నారు. అలాగే, జిల్లా సరిహద్దులు, ప్రధానమైన రోడ్లలో అధికారులు తనిఖీలు చేపడుతున్నారు.

దిండివనం వద్ద బస్సు బోల్తా

● 17 మందికి గాయాలు



గోతిలో పడ్డ బస్సును జేసీబీ యంత్రం ద్వారా వెలికితీస్తున్న కార్మికులు

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దిండివనం సమీపంలో ఆదివారం వేకువజామున రాష్ట్ర రవాణా సంస్థ బస్సు రహదారి పక్కనున్న గోతిలో బోల్తాపడడంతో డ్రైవర్ సహా 17 మంది ప్రయాణికులు గాయపడ్డారు. చెన్నై నుంచి అరియలూరుకు 50 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఆ బస్సు దిండివనం సమీపం పంచాక్షరం జంక్షన్ వద్ద ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశారు. దీంతో బస్‌డ్రైవర్ బృహదీశ్వరన్ లారీని ఢీకొనకుండా కుడివైపునకు తిప్పడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గోతిలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సహా 17 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమాచారం అందుకున్న ఓలక్కూరు పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌ల్లో ముండియంబాక్కం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన తొమ్మిదిమందిని చెన్నై జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

చెన్నైలో రూ.2 కోట్ల నగదు స్వాధీనం



నగరంలో ఓ కారును తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్‌స్క్వాడ్ సభ్యులు

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో లోక్‌సభ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఈనెల 16న శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు జరిపిన వాహన తనిఖీల్లో రూ.2కోట్ల నగదు పట్టుబడింది. శనివారం మధ్యాహ్నం కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు జారీ చేయడంతో సాయంత్రం నుంచే నగరంలోని నార్త్ చెన్నై, సెంట్రల్ చెన్నై, సౌత్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు హడావుడి ఆరంభమైంది. నగరవ్యాప్తంగా 16 తనిఖీ బృందాలు శనివారం సాయంత్రం నుంచే తనిఖీలు ప్రారంభించారు. షావుకారుపేటలో ఇద్దరి నుంచి రూ.1.42 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. రశీదులు లేకపోవడంతో ఆదాయపు పన్నుల శాఖకు అప్పగించాలు తెలిపారు. ఆదివారం ఉదయం వాల్‌టాక్స్ రోడ్డు వద్ద కారులో ఎలాంటి దస్తావేజులు లేకుండా తరలిస్తున్న రూ.10లక్షల నగదును కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్యారీస్ కార్నర్ వద్ద రూ.15లక్షల నగదు పట్టుబడింది.

రైతు అవయవాల దానం

● ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



సెల్వకుమార్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బైకు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మెదడు నిర్జీవమైన తిరుప్పూరు జిల్లా మేల్‌పాళయానికి చెందిన సెల్వకుమార్(58) అనే రైతు అవయవాలను ఆయన కుటుంబీకులు దానం చేశారు. ఆయన అంత్యక్రియలు ప్రభుత్వ లాంచనలతో నిర్వహించారు. ఈనెల 12న రాత్రి సెల్వకుమార్ బైకులో వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. వెంటనే ఆయన్ను చికిత్స నిమిత్తం ఈరోడ్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్సలందిస్తుండగా ఆయన మెదడు నిర్జీవమైంది. ఈ విషయం తెలుసుకున్న సెల్వకుమార్ కుటుంబ సభ్యులు అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. ఆ మేరకు సెల్వకుమార్ కిడ్నీలు, కాలేయాలు, నేత్రాలను కోయంబత్తూరు ఆసుపత్రిలో అవయవాల కోసం ఎదురు చూస్తున్న రోగులకు పంపారు. ఈ అవయవ దానం గురించిన వివరాలు నమోదు చేసుకున్న రెవెన్యూ అధికారులు సెల్వకుమార్ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో జరిపారు. సెల్వకుమార్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రారంభించిన కొద్ది గంటల్లోనే మద్యం దుకాణం మూసివేత

ప్యారీస్, మార్చి 17: స్థానిక అంబత్తూర్ పారిశ్రామికవాడలో కొత్తగా ఏర్పాటుచేసిన టాస్మాక్ దుకాణాన్ని వ్యతిరేకిస్తూ స్థానికులు ఆందోళన చేపట్టిన కారణంగా ప్రారంభించిన కొన్ని గంటల వ్యవధిలోనే మూసివేశారు. పారిశ్రామికవాడ సమీపంలోని రెడ్డిపాళయం రోడ్డులో టాస్మాక్ దుకాణం ఏర్పాటు చేసే పనులు నిర్వహించడం తెలుసుకున్న స్థానికులు, ఆ ప్రాంతంలో ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో కలసి దుకాణం ముందు బైఠాయించారు. అయినా పట్టించుకోని టాస్మాక్ అధికారులు పూజల అనంతరం శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభించారు. దీంతో ఆగ్రహించిన ప్రజలు, టాస్మాక్ దుకాణంలోకి చొరబడేందుకు యత్నించారు. దీంతో పోలీసులు వారిని నివారించేందుకు యత్నించారు. అయినా దుకాణం మూసివేసే వరకు తాము అక్కడి నుంచి కదిలివెళ్లే ప్రసక్తే లేదని రోడ్డుపై సుమారు రెండు గంటల పాటు బైఠాయించారు. సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న పోలీసు అధికారులు సాయంత్రం 6 గంటలకు దుకాణం మూసి వేయడంతో ఆందోళన ముగిసింది.

కొడుకును హత్య చేసిన తల్లి అరెస్ట్

ప్యారీస్, మార్చి 17: మద్యం తాగేందుకు ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ విక్రయించి గొడవ చేసిన కుమారుడిని గొంతు నులిమి హతమార్చిన తల్లిని పోలీసులు అరెస్ట్ చేశారు. వెస్ట్ మాంబళం బృందావనం నగర్‌కు చెందిన శాంతి పలు ఇళ్లలో పనులు చేస్తూ కుమారుడు వెంకటేశ్ (40)తో నివసిస్తోంది. శనివారం ఉదయం వెంకటేశ్ అనుమానాస్పదంగా మృతిచెంది ఉన్నట్లు సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న అశోక్ నగర్ పోలీసులు మృతదేహాన్ని ఓమందూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టంలో వెంకటేశ్ హత్యకు గురైనట్లు తెలిసింది. దీంతో విచారణ జరిపిన పోలీసులు ఆదివారం ఉదయం శాంతిని అరెస్ట్ చేశారు. ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ విక్రయించి మద్యం తాగి తనతో గొడవ పడినందు వల్లే మట్టుబెట్టినట్లు ఆమె వాంగ్మూలం ఇచ్చినట్లు సమాచారం.

తొమ్మిదేళ్ల బాలికకు లైంగిక వేధింపులు

● మేస్త్రీకి 25 ఏళ్ల జైలు

పెరంబూర్, మార్చి 17: వేలూరు జిల్లాకు చెందిన మేస్త్రీ బాలికను కిడ్నాప్ చేసి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. పోక్సో ప్రత్యేక న్యాయస్థానంలో వాదనలు పూర్తికావడంతో నిందితుడికి 25 ఏళ్ల జైలు శిక్ష, రూ.10,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

'డాక్టర్ - యాక్టర్' పదాలు ధీరజ్‌కు సరిపోతాయి : జయం రవి

హీరో ధీరజ్‌కు డాక్టర్, యాక్టర్ అనే రెండు పదాలు సరిగ్గా అతికినట్టు సరిపోతాయని హీరో జయం రవి అన్నారు. ధీరజ్, స్మృతి వెంకట్, జంటగా, కోవై సరళ, ఎంఎస్ భాస్కర్, మునీష్‌కాంత్, కాళి వెంకట్, సునీల్ రెడ్డి, కరుణాకరన్, యాషిక ఆనంద్ తదితరులు ఇతర పాత్రలను పోషించిన చిత్రం 'డబుల్ టక్కర్'. త్వరలో విడుదలకు సిద్ధమైన ఈ చిత్రాన్ని ఎయిర్ ఫ్లిక్ నిర్మించగా, మీరా మహది దర్శకత్వం వహించారు. విద్యాసాగర్ సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియో విడుదల వేడుకను చెన్నైలోని సాయిరాం ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించారు. ఇందులో అయలాన్ దర్శకుడు రవికుమార్, హీరో జయం రవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధీరజ్ మాట్లాడుతూ... 'రజనీ, కమల్, విజయ్, షారూక్ వంటి అగ్ర నటులు పంచుకున్న ఈ వేదికను నాకు ఇచ్చిన సాయిరాం కాలేజీ యాజమాన్యానికి ధన్యవాదాలు. ప్రతి ఒక్కరినీ అలరించేలా, కడుపుబ్బ నవ్వించేలా సినిమా ఉంటుంది. థియేటర్‌లో చూసి ఎంజాయ్ చేయండి' అని అన్నారు. హీరో జయం రవి మాట్లాడుతూ... 'నాకున్న అతికొద్దిమంది సన్నిహితుల్లో ధీరజ్ ఒకరు. డాక్టర్‌గా ఉంటూ సినిమాల్లో నటించినందుకు సంతోషంగా ఉంది. మేమిద్దం త్వరలోనే కలిసి నటిస్తాం. డాక్టర్, యాక్టర్ అనే పదాలు ధీరజ్‌లు సరిగ్గా అతికినట్టు సరిపోతాయి. అందుకే అతనికి తగినట్టుగానే 'డబుల్ టక్కర్' అనే టైటిల్‌ను పెట్టినట్టు తెలుస్తోంది. విద్యాసాగర్ సంగీతం అంటే నాకు చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టం. ఆయన ఈ సినిమాకు సంగీతం అందించడం చాలా సంతోషంగా ఉంది' అన్నారు. అలాగే, 'అయలాన్' ఫేం రవికుమార్, దర్శకుడు మీరా, హీరోయిన్ స్మృతి వెంకట్, సంగీత దర్శకుడు విద్యాసాగర్, నటులు ఎం.ఎస్.భాస్కర్, కాళివెంటక్ తదితరులు ప్రసంగించారు. ఈ చిత్ర ట్రైలర్‌ను ఇటీవల రిలీజ్ చేయగా, ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చిన విషయం తెల్సిందే.

చిత్రజ్యోతి



జయం రవి
→ తదితరులతో సెల్ఫీ దిగుతున్న ధీరజ్

క్షమాపణలు చెప్పిన విజయ్ ఆంటోని!

సంగీత దర్శకుడు, డైరెక్టర్, సినీ హీరో విజయ్ ఆంటోని క్రైస్తవ మతపెద్దలకు క్షమాపణలు చెప్పారు. ఆయన తాజాగా ఓ యూట్యూబ్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో యేసుక్రీస్తు గుర్తించి తప్పుగా మాట్లాడినట్టు ప్రచారం జరిగింది. 'మద్యం సేవించే విషయంలో స్త్రీపురుషభేదాలు చూడరాదు. మద్యం సేవించడం అనేది అన్ని జాతుల్లో సర్వసాధారణమైన అంశం. పురాతనకాలంలో కూడా మద్యం ఉండేది. దాన్ని కాలానుగుణంగా పేరు మార్చుకుంటూ వచ్చారు. సారా అనే పేరుతో గతంలో సేవించేవాళ్లం. ఇపుడు బడా కంపెనీలు ఉత్పత్తి చేసి, వివిధ రకాలైన పేర్లతో విక్రయించే మద్యాన్ని తాగుతున్నాం. యేసుక్రీస్తు కూడా ద్రాక్షరసం సేవించారు' అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను తమిళనాడు క్రైస్తవ సమాఖ్య తీవ్రంగా ఖండించింది. బహిరంగ క్షమాపణ చెప్పకుంటే విజయ్ ఆంటోని ఇంటి ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించింది. దీంతో విజయ్ ఆంటోని సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. అందులో 'ప్రియమైన క్రైస్తవ సోదరులారా... ద్రాక్ష రసం ఇప్పుడు కనిపెట్టలేదు. రెండు వేల సంవత్సరాల క్రితం నుంచే వాడుకలో ఉంది. దేవాలయాలు, చర్చీల్లో వినియోగించారు. నేను ఇంటర్వ్యూలో వెల్లడించిన విషయాలను తప్పుగా వక్రీకరించారు. ఈ విషయంలో మీ మనస్సులను నొప్పించివుంటే క్షమాపణలు కోరుకుంటున్నా. మతాలకు అతీతంగా ప్రజల కోసం రక్తాన్ని చిందించి పరలోకానికి వెళ్లిన యేసును తప్పుగా చిత్రీకరిస్తానని కలలో కూడా ఊహించను' అని పేర్కొన్నారు.



విజయ్ ఆంటోని

మెగాఫోన్ పట్టనున్న హీరో విశాల్ 'తుప్పరివాలన్-2'కు దర్శకత్వం?

హీరో విశాల్ మెగాఫోన్ పట్టనున్నారు. ఆయన నటించిన 'తుప్పరివాలన్'కు సీక్వెల్ రానుంది. ఈ చిత్రానికి విశాల్ దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమా లొకేషన్ల ఎంపిక కోసం లండన్, అజర్‌బైజాన్ తదితర ప్రాంతాలకు వెళుతున్నట్టు విశాల్ తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. యాక్షన్ కింగ్ అర్జున్ వద్ద అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేసిన విశాల్... 2004లో వచ్చిన 'చెల్లమే' చిత్రం ద్వారా హీరోగా అవతారమెత్తారు. తాను హీరోగా నటించిన తొలి చిత్రమే బ్రేక్ ఇవ్వడంతో వరుసగా నటించడం మొదలుపెట్టారు. ఆ తర్వాత 2005లో లింగుస్వామి దర్శకత్వంలో వచ్చిన 'సండైకోళి'తో యాక్షన్ హీరోగా మారారు. ఇది ఆయన కెరీర్‌కు టర్నింగ్ పాయింట్. ఆ తర్వాత అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించారు. ఈ నేపథ్యంలో తన ఎక్స్ ఖాతాలో విశాల్ ఒక పోస్ట్ చేశారు. '25 యేళ్ల సినీ ప్రయాణంలో నా లక్ష్యం, నా కల, జీవితంలో నేను ఏం కావాలని కోరుకున్నానో అది కార్యరూపం దాల్చనుంది. త్వరలోనే ఒక కొత్త బాధ్యతలను చేపట్టనున్నా. నా జీవితంలో చాలెంజ్‌తో కూడుకున్న డెబ్యూ డైరెక్టర్‌గా మారనున్నా. 'తుప్పరివాలన్-2'కి దర్శకత్వం వహిస్తున్నా. ఈ విషయాన్ని వెల్లడించేందుకు పదాలు లేవు. నా తండ్రి జీకే రెడ్డి, యాక్షన్ కింగ్ అర్జున్ కష్టం ఎన్నటికీ వృథా కాదు. ఒక దర్శకుడిగా నా కలను ముందుకు సాగేలా ప్రోత్సహించిన దర్శకుడు మిష్కిన్‌కు ధన్యవాదాలు. రియల్ లైఫ్‌లోనూ, రీల్ లైఫ్‌లోనూ నన్ను నమ్ముకున్నవారి చెయ్యి వదిలిపెట్టలేదు. దేవుడి ఆశీర్వాదబలంతో లక్ష్యాన్ని చేరుకుంటా' అని పేర్కొన్నారు.



విశాల్

8 గంటలు డబ్బింగ్ చెప్పిన గౌండమణి

తాను ప్రధాన పాత్రను పోషించిన తాజా చిత్రం 'ఒత్త ఓటు ముత్తయ్య' కోసం సీనియర్ నటుడు గౌండమణి ఏకంగా 8 గంటల పాటు డబ్బింగ్ చెప్పారు. సినీ క్రాఫ్ట్ ఫిలిమ్స్ నిర్మాణంలో సాయి రాజగోపాల్ కథను సమకూర్చి, దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కామెడీ కింగ్ గౌండమణి హీరోగా నటించారు. పొలిటికల్ సెటైర్‌గా తెరకెక్కుతున్న ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను జోరుగా జరుపుకుంటోంది. స్థానిక వడపళనిలోని భరణి స్టూడియోలో ఈ సినిమా డబ్బింగ్ పనులు సాగుతున్నాయి. సమకాలీన రాజకీయాలపై తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించే పాత్రలో గౌండమణి పోషించారు. హీరో స్నేహితుడి పాత్రను యోగిబాబు పోషించారు. వీరిద్దరి మధ్య టైమింగ్, కెమిస్ట్రీ బాగా కుదిరిందని, వీరిద్దరి మధ్య సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించేలా ఉంటాయని దర్శకుడు సాయి రాజగోపాల్ చెప్పారు. ఇందులో దర్శకుడు కూడా ఓ ముఖ్య పాత్రను పోషించడం గమనార్హం. ముఖ్యంగా గౌండమణి - యోగిబాబు కాంబినేషన్‌పైనే కోలీవుడ్‌లో చర్చ సాగుతోంది. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో చూసి ఆనందించేలా ఈ సినిమా ఉంటుందన్నారు. గౌండమణి సరసన రాజేశ్వరి హీరోయిన్‌గా నటించగా, ఇతర పాత్రలను వాసన్ కార్తీక్, గజేష్, అన్బు మైల్‌స్వామి, సింగముత్తు, మొట్టై రాజేంద్రన్, రవి మారియా, వయ్యాపురి, డాక్టర్ గాయత్రి, కూల్ సురేష్ తదితరులు నటించారు.



డబ్బింగ్ స్టూడియోలో గౌండమణి

నాగదేవతలకు విదేశీ పర్యాటకుల క్షీరాభిషేకం



నాగదేవతల విగ్రహాలపై పాలు పోస్తున్న విదేశీ పర్యాటకులు

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కోవిల్‌లోని నాగరాజస్వామి ఆలయంలో విదేశీ పర్యాటకులు నాగదేవతలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కేరళ శిల్పకళతో నిర్మితమైన ఆ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. విదేశీయులు కూడా ఎక్కువగా వస్తుంటారు. ఆలయ గర్భాలయంలో ఐదు శిరస్సులతో కూడిన నాగరాజస్వామి భక్తులకు దర్శనమిస్తున్నారు. గర్భాయంలోపలి మట్టి ఆరునెలలపాటు నలుపురంగుతోనూ, మరో ఆరునెలలు తెలుపురంగుతో ఉంటుంది. ఇంతటి విశేషాలు సంతరించుకున్న ఆలయ ప్రాకారంలో వరుసగా ప్రతిష్ఠించిన నాగదేవతల విగ్రహాలపై భక్తులు క్షీరాభిషేకం చేయడం ఆనవాయితీ. ఆ మేరకు ఆదివారం ఆ ఆలయానికి విచ్చేసిన విదేశీ పర్యాటకులు నాగదేవతల విగ్రహాలకు క్షీరాభిషేకం జరిపారు. ఆ తర్వాత గర్భాయంలోని నాగరాజస్వామిని దర్శించుకున్నారు.

కోలీవుడ్ దర్శకుల సంఘం అధ్యక్షుడిగా ఆర్‌వీ ఉదయకుమార్

- ప్రమాణ స్వీకారం చేసిన కొత్త కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేసిన కొత్త కార్యవర్గం

అడయార్, మార్చి 17: తమిళ చిత్రపరిశ్రమ దర్శకుల సంఘానికి 2024-26 సంవత్సరానికిగాను ఎన్నికలు శనివారం జరగ్గా ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఆర్‌వీ ఉదయకుమార్, కార్యదర్శిగా పేరరసు, కోశాధికారిగా చరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా సుందర్ సి, వెంకటేష్, ఎళిల్ ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా రాజకుమరన్, మాదేష్, మనోజ్ కుమార్, మిత్రన్ ఆర్ జవహర్, ఎస్ఆర్ ప్రభాకరన్, రాజ్‌కపూర్, ఆర్.కన్నన్, రమేష్ ఖన్నా, శరవణ సుబ్బయ్య విజయం సాధించారు. మొత్తం 2600 మంది సభ్యులున్న ఈ సంఘంలో దాదాపు రెండు వేలమంది సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కొత్త కార్యవర్గ సభ్యులకు ఎన్నికల అధికారి సెంథిల్‌నాథన్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేయించారు.

డీపీఆర్ఎస్ తయారీలో ఐసీఎఫ్ రికార్డు



ఐసీఎఫ్‌లో తయారైన రైలింజన్

అడయార్, మార్చి 17: డిస్ట్రిబ్యూటెడ్ పవర్ రోలింగ్ స్టాక్ (డీపీఆర్ఎస్)లో ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ సరికొత్త రికార్డును నెలకొల్పింది. 2023-24 సంవత్సరంలో వెయ్యి డీపీఆర్ఎస్ కోచ్‌లను తయారు చేసింది. భారతీయ రైల్వేలో అత్యధిక డీపీఆర్ఎస్ కోచ్‌లను తయారుచేసిన యేడాదిగా మిగిలిపోయింది. డీపీఆర్ఎస్ కోచ్‌లలో వందేభారత్ బోగీలు, ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్స్ (ఈఎంయు), మెయిన్ లైన్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్స్ (ఎంఈఎంయు), సెల్ఫ్ ప్రొపెల్డ్ ఇన్‌స్పెక్షన్ కార్స్ (ఎస్‌పీఐసీ), సెల్ఫ్ ప్రొపెల్డ్ యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్స్ (ఎస్‌పీఏఆర్‌టీ) ఉన్నాయి. ఈ సరికొత్త రికార్డును నెలకొల్పిన ఐసీఎఫ్ అధికారులు, సిబ్బందిని ఐసీఎఫ్ జనరల్ మేనేజర్ యు.సుబ్బారావు ప్రత్యేకంగా అభినందించారు.

అధిష్ఠానం ఆదేశిస్తే పుదుచ్చేరిలో పోటీ

- మంత్రి నమశ్శివాయం వెల్లడి



అడయార్, మార్చి 17: తమ పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే పుదుచ్చేరిలో పోటీ చేస్తానని ఆ రాష్ట్ర మంత్రి నమశ్శివాయం తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి పోటీ చేయనున్నారు. దీంతో పోటీలో ఎవరుంటారన్న సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలో మంత్రి నమశ్శివాయం మాట్లాడుతూ... పార్టీ హైకమాండ్ ఆదేశిస్తే తాను పోటీ చేస్తానని ప్రకటించారు. పోలీస్ మాజీ ఐజీ చంద్రన్ భారతీయ జనతా పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నమశ్శివాయం వద్ద విలేకరులు ప్రస్తావించగా, పుదుచ్చేరి లోక్‌సభ స్థానం నుంచి ఎవరు పోటీ చేస్తారన్న అంశాన్ని పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందన్నారు. పార్టీ కార్యవర్గం ఆదేశిస్తే మాత్రం పోటీ చేస్తానని తెలిపారు.

పూర్వ విద్యార్థుల్లో నూతనోత్సాహం

రాజధాని కళాశాల 'సమాగమం' వేడుకల్లో వక్తలు



జ్యోతి ప్రజ్వలనలో పూర్వ విద్యార్థులు

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థులతో నిర్వహించే సమాగమం తరహా కార్యక్రమాలు నూతనోత్సాహం కలుగజేస్తాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. రాజధాని కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం 'పూర్వ విద్యార్థుల సమాగమం' జరిగింది. కవి, రచయిత డాక్టర్ టేకుమళ్ల వెంకప్పయ్య ఆహ్వానం పలికిన కార్యక్రమంలో కె.అనురాధ ప్రార్థనా గీతం ఆలపించారు. పూర్వ విద్యార్థుల జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి తెలుగు శాఖ అధ్యక్షురాలు డాక్టర్ ఎన్.ఎలిజబెత్ జయకుమారి అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా కళాశాల ప్రాచార్యులు ఎల్బీ శంకరరావు, గౌరవ అతిథిగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఓఆర్ దేవనాథన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జయకుమారి మాట్లాడుతూ... సుదీర్ఘ చరిత్ర కలిగిన రాజధాని కళాశాలలో జయకుమారి నేతృత్వంలో తొలి పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉన్నత పదవుల్లో పనిచేసిన వారు, ప్రస్తుతం పనిచేస్తున్న వారు హాజరుకావడం ఈ కార్యక్రమాన్ని శోభాయమానం చేసిందని అన్నారు. దేవనాథన్ మాట్లాడుతూ.. తెలుగు శాఖ, సాంస్కృతిక శాఖ అనే బేధం లేకుండా రెండు శాఖలు పూర్వం నుంచి పనిచేస్తున్నాయని, అక్కడ పనిచేసిన పరవస్తు చిన్నయసూరి, కందుకూరి వీరేశలింగం, కొక్కొండ వెంకటరత్నం వంటి మహానుభావుల సేవలు గుర్తుచేసుకోవాలని, ఇలాంటి సమావేశాలు పూర్వ విద్యార్థుల్లో నూతనోత్సాహం కలిగిస్తాయన్నారు. ఎల్బీ శంకరరావు మాట్లాడుతూ... సత్ప్రవర్తన, క్రమశిక్షణ గురించి మాట్లాడడంతో పాటు దేవళ్ల చిన్నికృష్ణయ్య, సాళ్వ కృష్ణమూర్తి వంటి ఆచార్యులతో తనకున్న సంబంధ బాంధవ్యాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులను శాలువలతో సత్కరించారు. అలాగే, దేవనాథన్, ఎల్బీ శంకరరావు, ఎల్.సుజాతను అధ్యక్షురాలు ఘనంగా సత్కరించారు. ఇలాంటి కార్యక్రమం ఏర్పాటుచేసిన అధ్యక్షురాలు జయకుమారిని పూర్వ విద్యార్థులు అభినందించి, ఘనంగా సత్కరించారు. డాక్టర్ ప్రమీల వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

అభ్యర్థిని ప్రకటించకుండానే బీజేపీ ప్రచారం



అర్ధరాత్రి ప్రచారంలో పార్టీ శ్రేణులు

ఐసిఎఫ్, మార్చి 17: విరుదునగర్ పార్లమెంటు నియోజకవర్గానికి అభ్యర్థిని ఇంకా ప్రకటించకపోయినా బీజేపీ నేతలు శనివారం రాత్రి ప్రచారం ప్రారంభించారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 19వ తేది జరగనున్న నేపథ్యంలో, ఈ నెల 20వ తేది నుంచి నామినేషన్ దాఖలు ప్రారంభం కానుంది. ఇప్పటికే డీఎంకే కూటమి ఖరారు కాగా, అన్నాడీఎంకే, బీజేపీలు పలు పార్టీలతో కూటమి ఏర్పాటుపై చర్చలు సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, విరుదునగర్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు శనివారం రాత్రి 9 గంటల సమయంలో పార్టీ కార్యాలయం ప్రాంగణంలో వినాయకుడి ఆలయం ముందు పూజలు చేసి వీధి ప్రచారాన్ని ప్రారంభించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని, అనుమతి లేనిదే ప్రచారం చేయరాదని హెచ్చరించడంతో, వారు కార్యాలయంలోనే ఒకరికొకరు పార్టీ కండువాలు కప్పుకుంటూ, తామర గుర్తుకు ఓట్లు వేయాలని ప్రచారం ప్రారంభించారు. ఈ విషయమై తూర్పు జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాండురంగన్ మాట్లాడుతూ... ఆదివారం అష్టమి ప్రారంభం కానుండడంతో, శనివారమే వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి ప్రచారం చేపట్టినట్లు తెలిపారు.



యూట్యూబర్ సహా ముగ్గురి అరెస్టు

- 5 సెక్షన్ల కింద కేసు నమోదు

అడయార్, మార్చి 17: యూట్యూబ్ వీడియోలు, రీల్స్ కోసం చెరువు నీటిపై పెట్రోల్ పోసి నిప్పంటించి డైవ్ చేసిన కేసులో తూత్తుక్కుడి జిల్లా సాత్తాన్‌కుళం పోలీసులు యూట్యూబర్ సహా ముగ్గురిని అరెస్టు చేశారు. వీరిపై ఐదు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తూత్తుక్కుడి జిల్లాలోని వలందూరు గ్రామానికి చెందిన బాలకృష్ణన్ యూట్యూబ్‌తో పాటు ఇన్‌స్టాగ్రాం ఖాతాలు కలిగి ఉన్నాడు. యూట్యూబ్ వీడియోలు, వ్యూస్ కోసం స్థానిక యువకులతో వివిధ రకాలైన సాహసాలు చేయించి, వాటిని వీడియో తీసి అప్‌లోడ్ చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో తాజాగా చెరువు నీటిపై పెట్రోల్ పోసి దానికి నిప్పంటించి, ఒక యువకుడు మంటలు చెలరుగుతున్న నీటిలో డైవ్ కొట్టాడు. దీన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడంతో ఇది వైరల్ అయింది. దీనిపై స్పందించిన పోలీసులు కేసు నమోదు చేసి యూట్యూబర్ బాలకృష్ణన్ సహా శివకుమార్, ఇసైక్కిరాజాని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

గంగా ఇనిస్టిట్యూట్‌లో వార్షిక క్రీడోత్సవాలు

అడయార్, మార్చి 17: కోయంబత్తూరులోని గంగా ఇనిస్టిట్యూటట్ ఆఫ్ హెల్త్ సెన్స్‌లో వార్షిక క్రీడోత్సవాలు జరిగాయి. ఈ వేడుకల్లో అర్జున అవార్డు గ్రహీత వాసుదేవన్ భాస్కరన్ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో ఇనిస్టిట్యూట్ డైరెక్టర్లు డాక్టర్ ఎస్.రాజసభాపతి, డాక్టర్ ఎస్.రాజశేఖరన్, ఇనిస్టిట్యూట్ డీన్ కమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్తర్ జాన్ తదితరులు పాల్గొన్నారు. 'ఛాలెంజ్ చాంపియన్' పేరుతో నిర్వహించిన వివిధ క్రీడాపోటీల్లో విజేత జట్టుకు బహుమతులతో పాటు ట్రోఫీని బహూకరించారు. ఇందులో గంగా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కనకవల్లి షణ్ముగనాథన్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతి ట్రోఫీతో విజేత జట్టు



రవికుమార్, రవిచంద్రన్‌లను సత్కరిస్తున్న నిర్వాహకులు

భక్తుల సేవే భగవంతుడి సేవ

ప్యారీస్, మార్చి 17: భక్తులను సేవిస్తే భగవంతుడిని సేవించనట్లేనని జీకే శెట్టి బిల్డర్స్ మేనేజింగ్ డైరెక్టర్ కేవీ రమణ శెట్టి అభివర్ణించారు. చెన్నైతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆర్య వైశ్య ప్రముఖుల అతిథియే కమిటీ ఆధ్వర్యంలో అయోధ్య రామజన్మభూమి రామ్‌లల్లా ప్రతిష్ఠను పురస్కరించుకుని జనవరి 19నుంచి 33రోజులు అయోధ్యను సందర్శించిన భక్తులకు నిరవధిక అన్నదానం నిర్వహించిన ఆర్యవైశ్య చారిటబుల్ ఫౌండేషన్, ఎస్ఏవీసీ ఫౌండేషన్, కార్తీక్ టిఫిన్ సెంటర్ నిర్వాహకులు కె.రవికుమార్, డి.రవిచంద్రన్‌కు స్థానిక చెట్‌పెట్‌లోని అన్నలక్ష్మి హోటల్‌లో ఆదివారం అభినందన సభ నిర్వహించారు.ముఖ్యఅతిథిగా విచ్చేసిన రమణ శెట్టి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అంకితభావంతో అన్నదానం నిర్వహించిన బృందాన్ని సముచిత రీతిన సత్కరించారు.అతిథియే కమిటీ నిర్వాహకులు జి.కస్తూరి రంగన్,సి.రంగనాథన్, కొంబై రామసుబ్రమణి, ఎం.జగదీశ్‌బాబు, ఆర్ఎస్ హరిరామ్ ప్రసాద్, ఎస్.సాయిరామ్ అయోధ్య అన్నదాన ఏర్పాట్ల గురించి వివరించారు. విశిష్ట అతిథులుగా జీఆర్‌టీ గ్రూప్ సంస్థల అధినేత జి.రాజేంద్రన్, అజంతా సంస్థ అధినేత డాక్టర్ కనిగెలుపుల శంకరరావు, గోపురం కుంకుమం అధినేత వైవీ హరికృష్ణ, అపోలో సుబ్రమణ్యం, ఎంవీ నారాయణ గుప్తా, టింబర్ సుబ్బారావు తదితరులు పాల్గొని సమష్టి కృషి ఫలితమే అన్నదానం విజయవంతమైందని ప్రశంసించారు.

ఆకలితో ఏడుస్తున్న పసికందుకు పాలిచ్చిన కోవై యువతి



యువతిని అభినందిస్తున్న అధికారులు

పెరంబూర్, మార్చి 17: రైల్వేస్టేషన్‌లో ఆకలితో ఏడుస్తూ అల్లాడిపోతున్న పసికందుకు పాలిచ్చిన కోవై యువతిని రైల్వే అధికారులు, పోలీసులు, ప్రయాణికులు అభినందించారు. చెన్నై నుంచి మదురైకి వెళుతున్న పాండ్యన్ ఎక్స్‌ప్రెస్ ఆదివారం తెల్లవారుజామున దిండుగల్ సమీపంలోకి వచ్చింది. అంబాదురై రైల్వేస్టేషన్‌లో మూడు నెలల పసికందుతో ఓ వ్యక్తి రైలెక్కాడు. రైలు ఎక్కినప్పటి నుంచి ఆ పసికందు బిగ్గరగా ఏడుస్తోంది. పసికందు చాలాసేపు ఏడడవడం గమనించిన ప్రయాణికులు, ఆ యువకుడు పసికందు ఎత్తుకెళ్తున్నాడా? అంటూ అనుమానించారు. మదురై రైల్వేస్టేషన్‌కు రైలు చేరుకున్న సమయంలో ఆ యువకుడు పసికందుతో దిగాడు. ప్రయాణికులు సదరు యువకుడిని రైల్వే పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతని వద్ద జరిపిన విచారణలో... భార్యాభర్తల మధ్య వాగ్వాదం తలెత్తడంతో పసికందును తీసుకొని వెళ్తున్నట్లు తేలింది. అదే సమయంలో ఏడుస్తున్న పసికందుకు బాటిల్‌లో పాలు ఇచ్చేందుకు పోలీసులు యత్నించినా, ఏడుస్తూనే ఉంది. దీంతో, పోలీసులు రైల్వే అధికారులను సంప్రదించగా, వారు లౌడ్ స్పీకర్ ద్వారా, పసికందు పాలిచ్చేందుకు బాలింతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. మదురై నుంచి కోయంబత్తూర్‌కు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చిన యువతి, ఆ ప్రకటన విని పసికందుకు పాలిచ్చేందుకు ముందుకొచ్చింది. కోవై వెళ్లే రైలు 15 నిమిషాల్లో బయల్దేరాల్సి ఉన్న సమయంలో ఆ యువతి, పసికందు ఆకలి తీర్చేలా పాలిచ్చారు. ఆ యువతిని రైల్వే పోలీసులు, అధికారులు, సహచర ప్రయాణికులు అభినందించారు.

జాఫర్‌సాదిక్ నుంచి 7 సెల్‌ఫోన్ల స్వాధీనం

- ఈమెయిల్ వివరాలపై దర్యాప్తు



జాఫర్ సాదిక్

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో మాదక ద్రవ్యాలను స్మగ్లింగ్ చేసిన కేసులో అరెస్టయిన తమిళ సినీ నిర్మాత జాఫర్ సాదిక్ నుంచి 7 సెల్‌ఫోన్లను కేంద్ర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధక అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సాదిక్ ఈమెయిల్ వివరాలను సేకరించి దర్యాప్తును ముమ్మరం చేశారు. దేశరాజధాని ఢిల్లీని కేంద్రంగా చేసుకుని జాఫర్‌సాదిక్ న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలకు మాదక ద్రవ్యాలను భారీ స్థాయిలో స్మగ్లింగ్ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. తాజాగా జరిపిన విచారణలో జాఫర్ ఏడు సెల్‌ఫోన్ల ద్వారా విదేశాల్లోని మాదకద్రవ్యాల ముఠా నాయకులకు ఈమెయిల్ సందేశాలు పంపినట్లు అధికారులు కనుగొన్నారు. ప్రస్తుతం ఆ ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని అందులోని వివరాల ద్వారా జాఫర్ సాదిక్‌కు విదేశీ ముఠాలతో ఉన్న సంబంధాలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. తాజా దర్యాప్తులో సాదిక్ అనుచరులు పలువురిని అరెస్టవుతారని తెలుస్తోంది.

- విలవంగోడు ఉపఎన్నిక...

పోటీకి కాంగ్రెస్ నేతల ఆరాటం

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలతోపాటు జరగనున్న విలవంగోడు శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నికలో పోటీ చేయడానికి కాంగ్రెస్ నేతలు ముమ్మర యత్నాలు సాగిస్తున్నారు. విలవంగోడు నియోజకవర్గ కాంగ్రెస్ శాసనసభ్యురాలు విజయధరణి రాజీనామా చేయటం వల్ల ఆ నియోజకవర్గానికి ఉపఎన్నిక జరగనున్న విషయం తెలిసిందే. ఈ నియోజకవర్గాన్ని ఎప్పటివలెనే కాంగ్రెస్ పార్టీకే కేటాయించనున్నట్లు డీఎంకే అధిష్ఠానం ప్రకటించింది. దీంతో ఆ నియోజకవర్గంలో పోటీ చేయడానికి కన్నియాకుమారి జిల్లాకు చెందిన పలువురు నేతలు ఇప్పటికే ఢిల్లీలో మకాంపెట్టి పార్టీ జాతీయ నాయకులతో తమకున్న పలుకుబడి ద్వారా తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. కన్నియాకుమారి వెస్ట్ జిల్లా నాయకుడు డాక్టర్ బినులాల్ సింగ్, జవహర్‌పాల్ మంచ్ సంస్థ అఖిల భారత సమన్వయకర్త సాముయేల్ జార్జి సహా పలువురు ఆ సీటు కోసం ప్రయత్నిస్తున్నారు. విలవంగోడు నియోజకవర్గంలో మళ్లీ మహిళా అభ్యర్థిని పోటీకి దింపే అవకాశం ఉందని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుందగై చెబుతున్నారు. అదే నిజమైతే కన్నియాకుమారి జిల్లా మహిళా విభాగం నాయకురాలు షర్మిలా ఏంజెల్‌కు సీటు లభించే అవకాశం ఉంది. ఈ నియోజకవర్గంలో బీజేపీ తరఫున మళ్లీ జయశీలన్ పోటీ చేస్తారని తెలుస్తోంది. అదే సమయంలో ఇటీవల బీజేపీలో చేరిన విజయధరణిని ఆ పార్టీ మళ్ళీ బరిలోకి దింపే అవకాశం కూడా ఉంది.

విలవంగోడు ఉప ఎన్నిక: 272 పోలింగ్ కేంద్రాలు

పెరంబూర్, మార్చి 17: విలవంగోడు శాసనసభ ఉపఎన్నిక సందర్భంగా 272 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ... విలవంగోడు శాసనసభ ఉప ఎన్నికల్లో 2.37 లక్షలమంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. ఈ నియోజకవర్గంలో 22 కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. అలాగే, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేస్తున్న 698 పోలింగ్ కేంద్రాల్లో 199 సమస్యాత్మకమైనవని కలెక్టర్ తెలిపారు.